# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-03-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఎస్సీ వర్గీకరణపై ఎన్నికల హామీ మేరకు 30 ఏళ్ల నిరీక్షణకు మంచి ముగింపు పలికామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.**
2. **తెలంగాణలో 30-40 రోజుల్లో గ్రూపు-1, 2, 3 ఉద్యోగ నియామకాలు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించారు.**
3. **ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు నిరవధికంగా వాయిదాపడ్డాయని సభాపతి సీహెచ్.అయ్యన్నపాత్రుడు ప్రకటించారు.**
4. **ప్రతి మూడు నెలలకు ఒకసారి డ్వాక్రా సంఘాల అంతర్గత ఆడిట్ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.**
5. **పర్యావరణ సమతుల్యత, సహజ వనరుల పరిరక్షణే లక్ష్యంగా “అడవులు-ఆహారం” అనే ఇతివృత్తంతో ఈరోజు అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

=========================

ఎస్సీ వర్గీకరణపై ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని, 30 ఏళ్ల నిరీక్షణకు మంచి ముగింపు పలికామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. వర్గీకరణపై అపోహలు అక్కర్లేదని, ఎవరికీ నష్టం జరగదని వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణపై శాసనసభలో నిన్న చేపట్టిన లఘుచర్చకు ముఖ్యమంత్రి సమాధానమిస్తూ.. ఎస్సీ ఉపకులాల్లో సమన్యాయం కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు వర్గీకరణ చేశామని వెల్లడించారు. అందరికీ సామాజిక న్యాయం అందించేందుకు కట్టుబడి ఉన్నామని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ..

.. వాయిస్.. 28 సెకన్లు

--------------------------

ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి ఆద్యుడు మంద కృష్ణమాదిగ అయితే.. రూపకర్త చంద్రబాబు నాయుడు, ఫలప్రదాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అనుసూచిత కులాల ఉప వర్గీకరణ నివేదికపై శాసనసభలో నిన్న జరిగిన లఘుచర్చలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి బాధ్యత తీసుకుని నాలుగు నెలల వ్యవధిలో వర్గీకరణపై శాస్త్రీయంగా అధ్యయనం చేయించారని వెల్లడించారు. వర్గీకరణ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టినందుకు జనసేన పార్టీ తరపున మనస్ఫూర్తిగా

సమర్థిస్తున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు.

---------------------------

భవిష్యత్తులో జనగణన పూర్తయ్యాక, దాని ప్రాతిపదికన జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ అమలు చేయొచ్చని రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషన్ సూచించిందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. 'అనుసూచిత కులాల ఉపవర్గీకరణ నివేదిక'పై శాసనసభలో నిన్న జరిగిన లఘుచర్చకు మంత్రి సమాధానమిస్తూ.. ఏకసభ్య కమిషన్‌లోని ఐదు సిఫారసులను వివరించారు. జనాభా లెక్కలపై స్పష్టత లేకపోవడంతో ఇప్పుడు సిఫారసు చేయడం లేదని కూడా తన నివేదికలో పేర్కొందని చెప్పారు.

---------------------------

తెలంగాణలో 30-40 రోజుల్లో గ్రూపు-1, 2, 3 ఉద్యోగ నియామకాలు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిన్న నిర్వహించిన 'ప్రజాపాలనలో కొలువుల పండగ' కార్యక్రమంలో ఆయన పాల్గొని.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖల్లో కారుణ్య, కొత్త నియామకాలకు సంబంధించి 922 మందికి పత్రాలు అందజేశారు. బిల్డ్‌నౌ పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తొలి ఉద్యోగం ద్వారా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో భవన నిర్మాణ అనుమతుల్లో అక్రమాలను అరికట్టేందుకే బిల్డ్‌నౌ పోర్టల్‌ను తీసుకొచ్చామని రేవంత్ రెడ్డి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు నిరవధికంగా వాయిదాపడ్డాయని సభాపతి సీహెచ్.అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. గవర్నర్ ప్రసంగం రోజు మినహా సమావేశాలు 15 రోజులపాటు కొనసాగాయని, మొత్తంగా 85 గంటల 52 నిమిషాలపాటు సభా కార్యక్రమాలు జరిగాయని వెల్లడించారు. మొత్తం తొమ్మిది బిల్లులు ప్రవేశపెట్టగా.. వాటిని సభ ఏకగ్రీవంగా ఆమోదించిందని సభాపతి తెలిపారు. 113 నక్షత్ర ప్రశ్నలు, 2 స్వల్ప వ్యవధి ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారని, 37 నక్షత్ర గుర్తు ప్రశ్నలకు సమాధానాలను సభ సమక్షంలో ఉంచారని అయ్యన్నపాత్రుడు వెల్లడిస్తూ..

వాయిస్ ...26 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ప్రతి మూడు జిల్లాలకు ఓ క్రీడా పాఠశాల నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆంధ్రప్రదేశ్ క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శాసన మండలిలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు నిన్న ఆయన సమాధానమిస్తూ.. క్రీడా ప్రాధికార సంస్థ.. శాప్ ఆధ్వర్యంలో విజయవాడ, విజయనగరంలో క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, ఎన్టీఆర్, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో క్రీడా అకాడమీలను అందుబాటులోకి తెస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి వివరించారు.

---------------------------

ప్రతి మూడు నెలలకొకసారి డ్వాక్రా సంఘాల పుస్తకాల అంతర్గత ఆడిట్ నిర్వహించాలని అధికారులను

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. విజయవాడలో నిన్న నిర్వహించిన జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నకిలీ సంఘాలు ఏర్పాటు చేసుకుని అక్రమంగా బ్యాంకుల నుంచి రుణాలు పొందటాన్ని పూర్తిగా నివారించాలని స్పష్టం చేశారు.

---------------------------

ఈరోజు అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. పర్యావరణ సమతుల్యతను, సహజ వనరులను పరిరక్షించేందుకు అటవీ సంపదను కాపాడవల్సిన ఆవశ్యకతను తెలియచేసేందుకు ఐక్యరాజ్యసమితి 2012 నుంచి ఏటా మార్చి 21వ తేదీన అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం "అడవులు–ఆహారం" అనే ఇతివృత్తంతో అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దేశంలో అటవీసంపదను కాపాడవలసిన ఆవశ్యకతను చాటిచెబుతూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకోనున్నారు. నిన్న రాత్రి ఆయన, కుమారుడు.. మంత్రి లోకేశ్‌తో కలిసి తిరుమలలోని శ్రీపద్మావతి అతిథిగృహానికి చేరుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు, కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.

కాగా.. ఈ ఉదయం శ్రీవారి దర్శనానంతరం చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొంటారు. స్వయంగా భక్తులకు అన్నప్రసాదం వడ్డించి వారూ స్వీకరించనున్నారు.

---------------------------

తెలంగాణలో నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు జరగనున్నాయి. పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు.. విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 2 వేల 650 కేంద్రాల్లో 5 లక్షల 9 వేల 403 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

---------------------------

తెలంగాణాలో ఈరోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం బ్రిడ్జ్ కోర్సు పేపర్ 1, పబ్లిక్ అడ్మిన్స్ట్రేషన్ పేపర్ 1 పరీక్షలు జరుగుతాయి.

---------------------------

వాయవ్య గాలుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమలో ఎండల తీవ్రత పెరిగింది. దేశంలోనే అత్యధికంగా అనంతపురంలో నిన్న 41.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ రోజు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని 49 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. మరోవైపు.. రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. కాగా..తెలంగాణలో ఈ రోజు, రేపు అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే

అవకాశం ఉందని హైదరాబాద్‌లోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన వర్షాలు  పడొచ్చని పేర్కొంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈ నెల 30వ తేది ఆదివారం ప్రసారం అవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

======================